بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 28 November 2025 (Telugu)

# తబూక్ యుద్ధ నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 28.11.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

తబూక్ ప్రయాణానికి సంబంధించిన మరిన్ని వివరాలను నేను ఈ రోజు తెలియజేస్తాను. కొంతమంది కపటులు యుద్ధానికి వెళ్ళడానికి నిరాకరిస్తు వివిధ సాకులను చెప్పారనే విషయం గత ఖుత్బాలలోనే చెప్పబడింది. కానీ మదీనాకు తిరిగి వచ్చిన తర్వాత కూడా కపటులు యుద్ధంలో పాల్గొనక పోవడంపై సాకులు, వంకల గురించి ప్రస్తావన లభిస్తుంది. దీని గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో కూడా ప్రస్తావించబడింది. మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణం నుండి మదీనాకు తిరిగి వచ్చినప్పుడు ముందుగా మస్జిద్‌నకు చేరుకుని రెండు రకాత్‌ల నమాజ్ (నవాఫిల్) చేయడం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆచారం. నవాఫిల్ పూర్తి చేసుకుని, ఆయన మస్జిద్‌లోనే కూర్చున్నారు. ప్రజలు ఆయనను కలవడానికి, వారిని దర్శించుకోవడానికి రావడం ప్రారంభించారు. ఇదే విధంగా తమ బలహీన విశ్వాసం, కపటత్వం కారణంగా వెంట వెళ్ళని వారు కూడా రావడం మొదలు పెట్టారు. జీవిత చరిత్రకారులు రాసిన దాని ప్రకారం ఈ వ్యక్తులు దాదాపు (80) ఎనభై మంది వరకుండిరి. కానీ కొన్ని కథనాల ప్రకారం అంతకంటే ఎక్కువ మంది కూడా ఉండిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి బాహ్య సాకులను అంగీకరించి, వారితో బైఅత్ తీసుకొని వారి క్షమాపణ కోసం ప్రార్థించారు. వారి అంతరంగిక విషయాలను అల్లాహ్‌కే వదిలి వేశారు.

కానీ ఈ కపటుల నేరం క్షమించరానిది. అందుకే వీరు ఎంతటి అపవిత్రులునగా అల్లాహ్ తఆలా వీరితో ఎన్నటికి సంతోషడలేదని ఈ వ్యక్తుల గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు దైవ వాణి ద్వారా తెలియజేశాడు. కావున అల్లాహ్ తఆలా అత్తౌబహ్ అధ్యాయంలో ఈ వ్యక్తుల గురించి తెలియ జేశాడు. తబూక్ యుద్ధంలో వెనుకబడి ఉన్నవారిపై అల్లాహ్ తఆలా తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. వారిని పాపిష్టులని ప్రకటించాడు, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను వారి అంత్యక్రియల నమాజ్ చేయకుండా, వారి సమాధి వద్ద ప్రార్థించకుండా నిషేధించాడు. భవిష్యత్తులో

వారు ఏ ఉద్యమంలోనూ పాల్గొనకూడదని, ఏ యుద్ధంలోనూ చేరకూడదని కూడా ఆంక్షలు విధించబడెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. తబూక్ యుద్ధం నుండి వెనుకబడి ఉన్నవారు నాలుగు రకాల వ్యక్తులుండిరి. **మొదటి రకం:** దైవ సందేశహరుని ఆజ్ఞ మేరకే ఏదేని బాధ్యతను నెరవేర్చకుండా వెనుకబడి ఉన్న అదృష్టవంతులు. ఉదాహరణకు హ్రజత్ అలీ రజియల్లాహు అన్హు, ఇబ్న్ ఉమ్మె మక్తూమ్ (రజి), ముహమ్మద్ బిన్ మస్లమ (రజి) మొదలైనవారు. **రెండవ రకం:** వికలాంగులు, రోగులు, బలహీనులు లేదా చాలా పేదవారు, రవాణా సామర్థ్యం లేనివారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి గురించి మాట్లాడుతూ వారు ప్రతిచోటా మనతోనే ఉన్నారని పేర్కొన్నారు. **మూడవ రకం:** కపటులు, వారి పాత్ర తీవ్రంగా ఖండించబడింది, పవిత్ర ఖుర్ఆన్‌లో శాశ్వతంగా వారి పట్ల ఆగ్రహం, కఠినమైన శిక్ష, హెచ్చరిక తెలుపుతు ఆదేశం అవతరించెను. **నాలుగవ రకం:** కేవలం సోమరితనం కారణంగా చేరకుండా వెనుకబడి ఉన్న వ్యక్తులు. వీరిలో ప్రత్యేకంగా చెప్పదగినవారు ముగ్గురు అనుచరులుండిరి. అనగా హ్రజత్ కఅబ్ బిన్ మాలిక్ (రజి), హ్రజత్ మురార బిన్ రబీఅ (రజి), ఇలాగే హ్రజత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్ (రజి).

ఈ ముగ్గురు అనుచరులు రజియల్లాహు అన్హుమ్ గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఒక సూక్తి కూడా అవతరించింది. హుజూరె అన్వర్ ఇట్లనిరి. عَلَى الثَّلٰثَةِ الَّذِيْنَ خُلِّفُوْا అనగా వెనుకబడి ఉన్న ఆ ముగ్గురు వ్యక్తులు. వీరి సంఘటన వివరాలు ఈ విధంగా ప్రస్తావించబడ్డాయి. బుఖారీలోని ఒక కథనంలో హ్రజత్ కఅబ్ బిన్ మాలిక్ రజియల్లాహు అన్హు స్వయంగా ఈ మొత్తం సంఘటనను వివరించారు. వారిట్లు తెలిపిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణానికి సన్నాహాలు ప్రారంభించారు, ముస్లింలు కూడా ఆయనతో పాటు సన్నాహాలు ప్రారంభించారు. నా ఉద్దేశం కూడా పటిష్టంగానే ఉండెను. కానీ సోమరితనం కారణంగా నేను సన్నాహాలు చేసుకోలేదు. నేను ఆలస్యం చేస్తూనే ఉండిపోయాను. తుదకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక ఉదయం బయలుదేరారు, నేను నా ప్రయాణ సన్నాహాల్లో ఏమీ పూర్తి చేసుకోలేదు. ఆయన బయలు దేరిన ఒకటి లేదా రెండు రోజుల తర్వాత నేను సన్నాహాలు పూర్తి చేసుకుని వారితో కలుస్తానని నేను భావించాను. ఇదే పరిస్థితి కొనసాగింది. చివరికి సైన్యం వేగంగా ప్రయాణించి చాలా ముందుకు వెళ్ళింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బయలు దేరి వెళ్ళిన తర్వాత నేను ప్రజలలోకి వెళ్లి వారి మధ్య తిరిగినప్పుడల్లా కపటత్వం, దాంబికత్వం అనే లోపం ఆపాదించబడిన వ్యక్తిని లేదా అల్లాహ్‌చే క్షమించబడిన బలహీనులలో ఒక వ్యక్తిని మాత్రమే చూడటం నాకు బాధ కలిగించేది. హ్రజత్ కఅబ్ బిన్ మాలిక్ (రజి) ఇట్లు చెప్పుకునేవారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి వస్తున్నారనే సమాచారం నాకు తెలియగానే నాకు ఆందోళన కలిగింది. రేపు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కోపం నుండి ఎలా తప్పించుకోవాలని నేను అబద్ధపు మాటలు ఆలోచించడం ప్రారంభించాను.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేరుకున్నారని చెప్పబడినప్పుడు నా మనసు నుండి ఆ

అబద్ధపు ఆలోచనలన్నీ మాయమయ్యాయి. అబద్ధంతో కూడిన ఏ మాటతో నేను ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కోపం నుండి ఎప్పటికీ తప్పించుకోలేనని నేను అర్థం చేసుకున్నాను. అందుకే నేను ఆయనతో నిజం చెప్పాలని నిర్ణయించుకున్నాను.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చినప్పుడు వెనుకబడి ఉన్న వ్యక్తులు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పడం, ప్రమాణాలు చేయడం ప్రారంభించారు. అలాంటి వ్యక్తులు (80) ఎనభై మంది కంటే కొంచెం ఎక్కువే ఉండిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి బాహ్య సాకులను అంగీకరించి, వారితో బైఅత్ తీసుకున్నారు. అదే సమయంలో నేను ఆయన వద్దకు చేరుకొని ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంనకు నేను సలాం చెప్పినప్పుడు కోపంగా ఉన్న వ్యక్తిలా ఆయన నవ్వారు. ఆయన నన్ను ఇట్లడిగిరి. నువ్వు ఎందుకు వెనుక ఉండిపోయావు, నువ్వు సవారీ కొనుగోలు చేయలేదా? నేనిట్లు వెడుకొంటిని. అవును! అల్లాహ్ ప్రమాణంగా! నేను ఎలాంటి వ్యక్తిననగా ఒకవేళ నేను మీరు కాకుండా ప్రపంచంలోని ఇంకెవరి దగ్గరనైనా కూర్చుని ఉంటే నేను ఖచ్చితంగా ఒక సాకుతో అతని కోపం నుండి తప్పించుకోగలిగేవాడిని. నాకు మంచి వాక్చాతుర్యం ఇవ్వబడింది. కానీ అల్లాహ్ ప్రమాణంగా ఒకవేళ నేను ఈ రోజు మీతో అబద్ధం చెబితే దానితో మీరు నాపై సంతోషించ వచ్చును కానీ అల్లాహ్ త్వరలో నాపై మీకు కోపం తెప్పించునని నేను బాగా అర్థం చేసుకున్నాను. ఒకవేళ నేను మీతో నిజం చెబితే దాని వలన మీరు నాపై కోపం తెచ్చుకున్నా దాని వలన అల్లాహ్ క్షమాపణను నేను ఆశిస్తున్నాను.

ఇంకా ఇట్లు తెలిపిరి. అల్లాహ్ ప్రమాణంగా! నాకెలాంటి సాకు లేకుండెను. అల్లాహ్ ప్రమాణంగా! నేను మీ నుండి వెనుకబడి ఉన్న సమయంలో ఉన్నంత సంపన్నంగా, సుఖంగా మరెప్పుడూ నేను లేకుంటిని. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా మాట విని ఇట్లనిరి. ఇతను నిజం చెప్పాడు. లేచి వెళ్ళిపో. నీ గురించి అల్లాహ్ తఆలా ఏదైనా తీర్పు ఇచ్చే వరకు నిరీక్షించు. అప్పుడు నాతో పాటు మురార బిన్ రబీఅ ఉమరీ, హిలాల్ బిన్ ఉమయ్యహ్ కూడా నేను చెప్పినదే చెప్పారు. కావున నాకు లభించిన సమాధానమే వారికి కూడా లభించింది. హజ్రత్ కఅబ్ (రజి) ఇంకా ఇట్లు తెలిపిరి. ఆ సమయంలో నాకు ఘస్సాన్ రాజు నుండి ఒక లేఖ అందింది. అందులో ఇట్లు వ్రాసి ఉండెను. నీ సహచరుడు నీ పట్ల కఠినంగా వ్యవహరించి నిన్ను ఒంటరిగా విడిచిపెట్టాడని నాకు తెలిసింది. అవమానం ఉన్నటువంటి ఇంట్లో నువ్వు జన్మించలేదు. నవ్వు వృథా అయ్యే వ్యక్తివి కాకూడదు. నువ్వు వచ్చి మాతో చేరపో, మేము మీకు గౌరవ, మర్యాదలు కల్పిస్తాం. ఈ లేఖ నేను చదివినప్పుడు ఈ లేఖ మరొక పరీక్ష, ఆపద అని నేను భావించాను. కనుక ఆ లేఖ తీసుకుని ఒక పొయ్యి వైపునకు వెళ్ళి నేను ఆ లేఖను అందులో పడేశాను.

యాభై రాత్రులలోని నలభై రాత్రులు గడిచి పోయినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నుండి సందేశం తీసుకువచ్చిన వ్యక్తి నా వద్దకు వస్తున్నట్లు చూశాను. అతడిట్లు నాకు తెలిపెను.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మీరు తమ భార్య నుండి దూరంగా ఉండమని మీకు చెబుతున్నారు! నేను అతన్ని ఇట్లడిగాను. నేను ఆమెకు విడాకులివ్వాలా? లేక ఏమి చేయ్యాలి? అతనిట్లు వివరించెను. ఆమె నుండి దూరంగా ఉండు, ఆమె దగ్గరకు వెళ్లవద్దు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం నా ఇద్దరు సహచరులకు కూడా అదే సందేశం పంపారు.

యాభైవ రాత్రి ఉదయం నేను ఫజ్ర్ నమాజ్ చదివిన తర్వాత మా ఇంటి డాబాలలో ఒకదానిపై అల్లాహ్ ప్రస్తావించిన పరిస్థితిలోనే నేను కూర్చుని ఉన్నాను. అనగా నా ప్రాణం నాకు ఇబ్బందికరంగా అనిపిస్తు భూమి విశాలంగా ఉన్నప్పటికీ నాపై ఇరుకుగా అనిపిస్తుండెను. అదే సమయంలో ఒక పిలుపునిచ్చే వ్యక్తి స్వరాన్ని నేను ఇట్లు విన్నాను. ఓ కఅబ్ బిన్ మాలిక్! నీకు శుభవార్త! ఇది విని నేను సాష్టాంగం (సజ్దా)లో పడిపోయాను, కష్టం తొలగిపోయిందని నేను అర్థం చేసుకున్నాను. ఇది విని ప్రజలందరూ మాకు శుభవార్తలు చెప్పడం ప్రారంభించారు. హజ్రత్ కఅబ్ (రజి) ఇంకా ఇట్లు తెలిపేవారు. నేను మస్జిద్‌కు చేరుకుని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు అస్సలాము అలైకుం చెప్పినప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ముఖం ఆనందంతో మెరిసిపోతుండెను. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నీకు అత్యంత సంతోషకరమైన శుభదినపు శుభవార్త! నీ తల్లి నిన్ను కన్నప్పటి నుండి నీపై గడిచిన రోజులలో ఇదే గొప్ప రోజు. నేనిట్లు అడిగాను. ఓ దైవ ప్రవక్తా సల్లల్లాహు అలైహి వసల్లం! ఈ శుభవార్త మీ వైపు నుండి వచ్చిందా లేదా అల్లాహ్ తఆలా వైపు నుండి వచ్చిందా? ఆయన ఇట్లన్నారు. నా నుండి కాదు. ఇది అల్లాహ్ వైపు నుండియే అందినది.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు తన శైలిలో వివరించిన మిగిలిన భాగాన్ని రాబోయే ఖుత్బాలో ప్రస్తావింతును. ఇన్షా అల్లాహ్.

ముగింపులో హుజూరె అన్వర్ గౌ॥ హాఫిజ్ ముహమ్మద్ ఇబ్రాహీం ఆబిద్ గారు మురబ్బీ సిల్సిలా, గౌ॥ షేక్ అబూ బకర్ జార్జ్ గారు ముఅల్లిమ్ సిల్సిలా లైబీరియా మరియు లైబీరియా నివాసులే అయిన గౌ॥ సమీనా భన్నో గారి (గౌ॥ డాక్టర్ ఫజల్ మహమూద్ భన్నో గారి భార్య) సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివింతునని ప్రకటించారు. ఇలాగే ఈ మృతుల క్షమాపణ, ఉన్నత స్థాయి అంతస్తుల కోసం కూడా ప్రార్థించారు

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ